# నాకు నచ్చిన కథ- "బొండు మల్లెలు"

## చిన్న కథకు పెద్ద దిక్కు చాసో - బగాది వెంకట్రావ్

వర్గ సమాజంలో శ్రమశక్తి దోపిడీ అనివార్యంగా ఉంటుంది. అయితే యిది వివిధ స్థాయిలలో వివిధ రూపాలలోనూవుంటుంది. ఈ దోపిడీ విధానాన్ని ఇది యిదీ అని చెప్ప కుండా అంటే యిజాల జోలికి పోకుండా తన కథలన్నింటా విపులంగా వివరించిన వారు సుప్రసిద్ధ కథా రచయిత చాసోగారు. తన పండిన ప్రాపంచిక దృక్పధాన్ని జోడించి మెలుకువగా కథ నల్లగలిగిన నేర్పరి చాసో. శ్రీశ్రీ లా కవిత చెప్పడం ఎంత కష్టమో చాసోలా కథ రాయడం కూడా అంతే కష్టం. ప్రజా జీవితంలోని హెచ్చుతగ్గులతోపాటు వారి రోదనా వేదనల్ని వారి భాషలోనే అనితర సాధ్యంగా వ్యక్తీకరించగలిగిన వ్యక్తి చాసో. డబ్బు సృష్టించే సమస్యలతోపాటు, అది మనిషిమీద చేసే స్వారీని ఏదో ఒక రూపంలో తన కథలన్నింటా ఆవిష్కరించాడు తాను. లేమి ఎంతటివారిలోనైనా మానవత్వాన్ని చంపి అమానుషత్వాన్ని పెంచుతుందనే నిజాన్ని నిర్భయంగా చెప్పగలవ్యక్తి చాసో. తన కథల్లో వైవిధ్యం, కథనంలో బిగువు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. అందుకే "విశ్వ సాహిత్యంలో ఏ ప్రథమశ్రేణి రచయితకూ తీసిపోని కథానికా శిల్పం ఆయన సొత్తని" ఆరుద్ర వంటివారి చేత కొనియాడబడ్డాడు. ఆ కోవకు చెందిన కథే తన "బొండు మల్లెలు " ఇదో మహత్తర మైన కథ.

ఊళ్లో పువ్వులకి గిరాకీ వుండడంవల్ల పెరడులోని ఖాళీ స్థలంలో మల్లెల్ని పెంచి నాలుగు డబ్బులు కూడెయ్యాలనుకుంటాడు రచయిత. ఆప్రయత్నంలోనే కూలివాణ్ణి వెతుకుతున్న తనకు పనికోసం తిరుగుతున్న తాత తారస పడతాడు. తాతకు తరంగాని పనే అది. అయినా కుదురుకుంటాడు తాత. అది తనకవసరం కనుక. తేరగా వచ్చినవాణ్ని పోనివ్వడు రచయిత. బేరం కుదురుద్ది. పాపం పదకొండు రోజులు పట్టింది తాతకి. డబ్బు లిచ్చేటప్పుడు గొడవచేస్తాడేమోననుకుంటాడు రచయిత. కాని అలా జరుగదు. కారణం తాతకు నోరూవాపీ లేదు. మారు మాటాడడు. ఇచ్చినంత పుచ్చుకుంటాడు. ఇదినచ్చి పర్మెనెంటుగా పెట్టుకుంటాడు రచయిత. తాత మొక్కలు పెంచి, మొగ్గలమ్మి సొమ్ముకూడేసి పెడుతుంటాడు. దాన్ని అప్పణంగా జేబులో వేసుకుంటాడు రచయిత. చివరికొక రోజు తాత జబ్బుచేసి నిమ్మళించి చనిపోయినట్టు తెలుసుకొని రచయిత బాధ పడతాడు. కష్టించి కూడేసింది తాతే అయినా కాజేసింది తనను కుంటాడు. ఆడబ్బే తాతదైతే అవసాన కాలంలో జరక్కపోనా అనుకుంటాడు. దోపిడీ చేసి సంపాదించిన వార్ని తన మల్లెలమ్మి దోపిడీ చెయ్యాలనుకున్న తను నిజానికి తాతనే పెద్ద దోపిడీ చేసినందుకు చింతిస్తాడు.

ఈ కథలో తాత, తనూ యిరువురూ రెండు వర్గాలకి ప్రతీకలుగా నిలబడతారు. పని లేని పల్లెజనం తమ శ్రమశక్తిని తేరగా అమ్ముకోవడాన్ని, తెలివైన భూస్వాములుదాన్ని కాష్ చేసుకోవడాన్ని కళ్ళకు కట్టినట్టు చూపుతాడు చాసో. కథ చిన్నదైనా అది రేకెత్తించే ఆలోచనలు బోలెడన్ని యిందులో.

# బొండుమల్లెలు

-చాసో

ఊళ్ళో పువ్వులకి మంచి ధర ఉన్నది. ఊరికేవుంది మా వెనక పెరడు. మంచి లాభం వస్తుందని మల్లె పెరడు వెయ్యడానికి నిశ్చయించాను.

మల్లెలమ్మి డబ్బు చెయ్యడంలో కొంత ప్రపంచాన్ని దోపిడీ చెయ్యడముంది. అయినా ఆ దోపిడి న్యాయంగా కనబడ్డది. ధనికులే - అనగా ప్రజలని దోపిడీచేసి ఐశ్వర్యవంతులయి న వాళ్లే నా మల్లెలు కొంటారు. అంచేత నేను దోపిడి చేస్తున్న వాళ్లని మల్లెలతో దోపిడి చేస్తాను.

పెరట్లో గోతులు తవ్వడానికి ఒక కూలివాడి అవసరం పడ్డాది. నాలుగురోడ్ల మద్య కెళితే పొట్ట వెన్నుకంటుకుపోయిన ముసలివాడు యెదురుగా వచ్చాడు.

"పనుందా బాబూ?" అనడిగేడు.

"నువ్వు చెయ్యలేవు" అన్నాను. రెండేసి మూళ్ల లోతుని గోతులు గునపంతో తవ్వాలి. మన్నూ మశానం వాటిలో కెత్తి బొండు మల్లె కుదపలు పాతాలి.

"ఏం పని బాబూ?" అన్నాడు.

"గునపంతో తవ్వాలి."

"తవ్వేస్తాను బాబూ" అన్నాడు. తాత తరమా? ముష్కరమైన వాడైతే అయిదురోజులు చేస్తాడు. తాత పదిరోజులకైనా చెయ్యలేడు. అతన్ని తీసికెళ్ళడం శుద్ధ దండుగ.

"పోనిస్తూ" అన్నాను.

"పని యేటో సూడనీయండి. మొత్తాన్ని సేసుకుంటాను. తమకి తోసింది ఇయ్యండి' ' అన్నాడు. అతని జాలికరమైన మొహంలోకి చూడగానే, యిష్టం లేకపోయినా కాదనలేకపోయాను.

"సరే" అన్నాను. వెంటపడ్డాడు. పని చూసుకొన్నాడు. పాపం చాలా తక్కువే అడిగాడు. బలమైనవాడికి ఐదురోజులపని. అంతకు ఎక్కువే ఇవ్వొచ్చు. బాగా తగ్గించి అడిగాను.


"కష్టం చూడండి బాబయ్యా" అన్నాడు.

"నాతో ఇన్ని బేరాలు లేవు"

"సరే తమసిత్తం. మద్దేన్నంవేనా తమరు ఇడిచిపెట్టేది, ఇంత గెంజి పొయ్యండి" అని ప్రాధేయపడ్డాడు.

"పోస్తానులే" అన్నాది నా పెళ్ళాం. చవకగా కుదిరేడని గ్రహించింది కాబట్టే ఆ అభిమానం! ఇంట్లో రోజూ సేరు గంజి వారుతుంది. వీధికాలువలోకి వొదిలిపెడుతున్నదే. తాతకి పోసినవల్ల నష్టంలేదు. సారవంతమైన గంజిని కాలువపాలుచేసి పిప్పిని "అన్నం" అనుకొని నాగరికులం తింటాం.

తాత పదకొండురోజులకిగాని పని పూర్తి చెయ్యలేకపోయాడు. తాతకి నోరూ వాపీలేదు. ఎలాగచెపితే అలాగ తవ్వేడు. అనుకొన్న ప్రకారం డబ్బు యిచ్చేను. ఎక్కువ అడుగుతాడనుకున్నాను. గునుస్తాడను





కున్నాను. అల్లరి చేస్తాడనుకున్నాను. ఏమీలేదు. నోరు కదపకుండా పట్టుకు పోయాడు. కాని, మర్నాడే "పని సెప్పరా?" అంటూ వొచ్చాడు.

"మొక్కలకి నీళ్ళు పోస్తావా?" అనడిగాను.

"పోస్తాను" అన్నాడు. నూతులో నీళ్ళు తోడాలి. మోసుకెళ్ళి పోయాలి.

"నెలకేమివ్వ మన్నావు?"

"తమ సిత్తం."

నెలకింత అని చెప్పేను.

"సిత్తం" అని ఇంకేదో చెప్పబోయాడు.

"ఏంటి తాతా?"

"....ఏటడుగుతాను?.....తమ రొగ్గేసినది' అని నసికిసికి, "గంజి నీళ్లు" అన్నాడు.

తాత కుదురుకున్నాడు. మాకుతేరగా దొరికేడు. తాతకి నోరూవాపీ లేదు. ఏం చెప్పినా చేసేవాడు. చీకటితోటొచ్చేవాడు. చీకటి పడుతుంటే వెళ్ళేవాడు. పగలల్లా ఏదోపని చేనస్తానే వుండేవాడు, మధ్యాహ్నం గంజిపోసేవాళ్ళం. తాత గంజిలోకి పిల్లలు దిగవిడిచిన అన్నం కెరళ్లుకూడా వెళ్ళేవి. తాత నంజుకోవడానికి విస్తళ్ళలో దిగబెట్టిన కూరలు, పాచిపట్టిన పచ్చళ్ళు వెళ్ళేవి.

నెలజీతం అందుకున్న మరునాడు తాత మొహం పరమానందంగా ఉంది.

"నా దినం తీరుతాది బాబూ" అని నాతో చెప్పేడు.

"ఏంటి విశేషం తాతా?"

"తమరిచ్చిన జీతం సేతిలెట్టాను. రేత్రి నా కూతురు పట్టెడన్నం పెట్టింది."

"రోజూ పెట్టడం లేదూ?"

"నేదు బాబూ, తమ పాదాలసాచ్చి, తమరింట్లో గంజి మెతుకులు తప్ప కడుపు కింకేటినేదు."

నా వొళ్లు కంపించింది.

"తాతా నీ కూతురు దగ్గరా ఉన్నావు?"

"సేత్తం."

"కొడుకుల్లేరూ?"

"కొడుకుండేవాడు, సచ్చిపోయాడు. నా నద్దానమైపోయాను. కోడలు ఏరే కాపురం సూసుకుంది.

"కూతురు తిండిపెట్టింది కాదేం?"

'కూడెట్టిందికాదు, డబ్బు సెర్లపోపిస్టి. తల్లీ పిల్లల ఆశలు సంపుతాది. రేత్రి జీతమంతా సేతిలెట్టినాను. పట్టెడన్నం పెట్టింది. ఇంక దినం తీరుతాది" అన్నాడు.

ఆ రోజు నుంచి తాత మా యింట్లో మనిషి అయిపోయాడు. తాతమీద ఇంటిల్లిపాదికి జాలికలిగింది. ఇంత అన్నంకూడావేసి ఆదరిస్తున్నారు.

మల్లెలు మొగ్గలు తొడిగేయి. మొగ్గలు అమ్మడం ఆరంభించేము. మధ్యాహ్నం బుట్టతో పట్టుకెళ్ళి తాతే అమ్ముకొచ్చేవాడు, సోలడు మొగ్గలు యింతా అని. బుట్టెడు మొగ్గలయేవి.

మల్లెలు రెండు విడతలు పూసాయి. తోటవల్ల మూడు వందల రూపాయల లాభం వచ్చింది. దాగరంత దొడ్డికి తాత జీతం పోను ఆ లాభం వచ్చింది. నేను చవగ్గా మొగ్గలమ్మేశాను. బొండు మల్లెలు సోల అణా ఏం? బేడన్నా కొందురు. అణాన్నరైనా చేయవలసింది. తెలిసింది కాదు.

వృద్ధి అయిన తరువాత మల్లెతోట ఎంతో సరదా వేసింది. నా మల్లెలు ఎంతోమంది యువతులు ధరించేరు, ఆనందించేరు. నేను రసజీవిని. అంచేత యువతుల వాల్జడలో బొండుమల్లెలు వికసించటం నాకెంతో మక్కువ.

తొలకరికి మరి తాత పనిలోకి రాలేదు. తాత భోగట్టా చెప్పేవారెవరూ లేకపోయారు. అన్నాళ్లు పనిచేసేడుకాని, అతని ఇల్లెక్కడో మేము కనుక్కోలేదు, తాత తాత అండమే తప్ప మాయింట్లో యెవరికీ అతని పేరు తెలియదు. అంత చిత్రంగా వుంటాయి మన సంబంధ బాంధవ్యాలు.

చాలకాలమైన తరవాత వంకాయలమ్మే మనిషి 'మీ దొడ్లో మల్లె మొక్కలు బాగున్నాయ' అని అడిగింది. మల్లెమొక్కలున్నట్లు నీకెలాగ తెలుసు ననడిగేను -

"మీ దొడ్లో తాత పనిచేసేవాడుకాదా?"

"తాత నెరుగుదువా?"

"అల్లుది మాయిదే"

"తాత బాగున్నాడా?"

"సచ్చిపోనాడు. మీకు తెల్దా?"

"చచ్చిపోయాడా! ఎప్పుడు?

అబ్బో శాన్నాళ్ళయింది. ఇంకా బతుకును బాబూ! జబ్బుచేసి నిమ్మళించింది. తరవాత కూతురు సూసిందికాదు. డాక్టేరుగారు పళ్ళూ జావలు ఎట్టమన్నారు. నాకాడెక్కడదని వొగ్గేసింది. సచ్చిపోనాడు. ఆ కూతురు సెర్ల ఘటి:కురాలు" అన్నాది.

కూతురిని అనవలసిన పనిలేదు. దానికోటి వుందో లేదో? ఎంత తండ్రి అయినా పెట్టడానికి కుండాలా? లేమి ఎంతటి వాళ్ళలోనైనా మానవత్వాన్ని చంపి అమానుషత్వాన్ని పెంచుతుంది.

వృద్ధులకి పెన్షనులైనా ప్రభుత్వం ఇస్తే బావుణ్ణు. జీవిత భీమా ఉన్నా బావుణ్ణు.

తాత వృత్తాంతం ఆలోచించినకొద్దీ నేనే ద్రోహం చేసినట్టు బాధ పడ్డాను. బొండుమల్లెలు వేసింది, పెంచింది, డబ్బుచేసింది తాతే! వచ్చిన ఫలితం నేను చల్లగా జేబులో వేసుకున్నాను. ఆ డబ్బంతా తాత ఆరన కాదూ? ఆ డబ్బే తాతదైతే ఎంత సుఖవడును? అవసానకాలంలో జరక్కపోనా? దోపిడీ చేస్తున్న వాళ్ళకి బొండుమల్లెలమ్మి దోపిడీచేస్తున్నానను కొన్నాను కాని, తాతని పెద్ద దోపిడీ నేనే చేసేను. నెలకి నాలుగు రాళ్ళు జీతం ఇచ్చి రోజుకిన్ని గంజినీళ్లుపోసి సాగనంపాను. దొడ్డి నాది ఫలితం కష్టపడ్డ వాడికి కాకుండాపోయింది.

●

## ప్రణాళిక

ఆక్స్‌ఫర్డ్‌లో అర్థశాస్త్రం చదివిన మేధావులు వాళ్ళు
ఏ. సి. రూముల్లో కూర్చొని వాళ్ళు తయారుచేసిన
ఇంద్రజాల మహేంద్రజాల ప్రణాళికలు!
వాటితో నాదేశం భూతల స్వర్గం అవుతుందనుకున్నా
కానీ!
కాస్మొటిక్స్ పరిశ్రమ కడుపు నింపదనీ
పెప్సీకోలా, మహాకోలాలు దాహం తీర్చవనీ తెల్సుకొన్నా!
అన్నం ఫ్యాక్టరీలలో తయారుకాదనీ
కర్షకుడి స్వేదంతో తడిచిన నేలనుంచి వస్తుందనీ
ఆ మేధావులకు తెలిసేదెలా?



రవీంద్రారెడ్డి, భీమిరెడ్డి.

## దిగంతరేఖపై!

నిఖిలేశ్వర్



ఇసుకరేణువుల మెరుపు
నా కంటి పాపలోకి తొంగిచూడగానే
రెప్పపాటులోనే సముద్రపుటలలన్నీ
మడతలు పడిన ఎడారి శరీరంలా,
అల్లంత దూరాన దిగంతరేఖపై
అల్లాడుతున్న తెరచాపలు పిరమిడ్ల ఆకారంలో
అస్తమిస్తున్న సూర్యుడిను
ఉదయిస్తున్న రవితేజస్సును
తన వెనకాలే నిలిపి
నా ఏకాగ్రతకు మృగతృష్ణలోని పరుగును-
నేర్పించిన ఆ అపురూప దృశ్యం
నిరంతరం వెంటాడుతూ--

"రేపు అంటే నీకు భయం లేనేలేదు
ఎందువల్లంటే నిన్నును అనుభవించినవాడివి
వర్తమానాన్ని గుండెలనిండా ప్రేమిస్తున్నవాడివి"వని
అన్వేషణలో జీవం నింపుతున్న అంతర్నాదం!